మాంసం మంచిదేనా..?

- రోడ్డుపైనే మేకలు వధిస్తూ విక్రయాలు
- వైద్యపరీక్షలు లేకుండానే అమ్మకాలు
- కౌటాలలో ఏర్పాటు చేయని స్లాటర్ హౌస్
- పట్టించుకోని అధికారులు


కౌటాలలో రోడ్డు పక్కనే మాంసం విక్రయాలు

కౌటాల: మండలంలో మాంసం విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు ప్రతీ ఆది, బుధవారాల్లో తమ ఇళ్లు, మురుగుకాలువ సమీపంలో, రోడ్ల పక్కన వధించి మాంసాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించకుండానే రోగాల బారినపడ్డ మేకలు కోస్తూ విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బహిరంగంగా దుమ్ము, దూళి, ఈగలు, దోమలు వాలుతున్న మటన్‌ను అమ్మకానికి పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మహారాష్ట్ర నుంచి మేకలు తీసుకొచ్చి ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించకుండా, నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులు మాంసం రూపంలో రోగాలు 'కొని'తెచ్చుకుంటున్నారు.

నిబంధనలు గాలికి..

మాంసం విక్రయాల కోసం మండల కేంద్రంలో మార్కెట్, మేకలు వధించడానికి స్లాటర్‌హౌస్ ఏర్పాటు చేయాలి. కోయడానికి సిద్ధం చేసిన మేకలను పశువైద్యాధికారితో పరీక్ష చేయిస్తే స్టాంప్ వేస్తారు. స్లాటర్ హౌస్ వద్దనే వాటిని కోసి అమ్మకాలు చేయాలి. వెటర్నరీ, మున్సిపల్ శాఖల ఆమోదముద్ర ఉండాలి. వ్యాపారం చేయడానికి లైసెన్సు కలిగి ఉండాలి. కానీ చాలా సందర్భాల్లో రోగాల బారిన పడిన గొర్రెలు, మేకలు ఇష్టారాజ్యంగా కోస్తూ, అమ్ముడుపోక మిగిలిన మాంసాన్ని మరుసటి రోజున అమ్ముతూ వ్యాపారం చేయడంతో కొనుగోలు చేసిన ప్రజలు రోగాలబారిన పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పలువురు అనుమతులు లేకుండా గొర్రెలు, మేకలను వధించి విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మాంసం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలతోపాటు రెబ్బెన, వాంకిడి, కౌటాల, తదితర మండలాల్లో ఏమాత్రం నిబంధనలు అమలు కావడం లేదు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌తో గాడిన పడేనా..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో పారిశుధ్య మెరుగుకు చర్యలు ప్రారంభించింది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆధునిక కబేళాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జంతు వధకే పరిమితం కాకుండా రక్తం, మాంసం వ్యర్థాలను సాంకేతికతను వినియోగించి శాస్త్రీయ విధానాల్లో రీసైక్లింగ్ చేసేలా దీన్ని రూపొందించాలని నిబంధనలున్నాయి. కానీ జిల్లాలో ఏ ఒక్క చోట కూడా ఆధునిక కబేళాల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో పలుచోట్ల విచ్చలవిడిగా మాంసం విక్రయాలు పెరిగాయి. కౌటాలలో గొర్రె మాంసాన్ని మేక అని చెప్పి దుకాణాదారులు విక్రయించారని వినియోగదారులు గతంలో ఆందోళన చేశారు. మాంసం విక్రయదారులు తప్పనిసరిగా జీవాల ఆరోగ్యంపై పశువైద్యులతో పరీక్ష చేసిన అనంతరమే వధించాలని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

నిబంధనలు ఇవి..

- గొర్రె, మేకలు, ఇతర జీవాలను వధించే ముందు ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి ధ్రువీకరించాలి.
- 6 నెలల వయసు దాటినవి వినియోగించాలి.
- జంతు వధశాలల్లో వధించి, శుభ్రం చేసిన మాంసాన్ని విక్రయించాలి.
- కోసిన తర్వాత మళ్లీ పశువైద్యశాఖ అధికారులు మాంసంపై ముద్రవేయాలి.
- జీవాలను ఉదయం 4 నుంచి 8 గంటల మధ్య మాత్రమే వధించాలి.

స్లాటర్ హౌస్ నిర్మించాలి

కౌటాలలో స్లాటర్ హౌస్ లేక మాంసం విక్రయదారుల ఇష్టారాజ్యంగా మేకలు కోస్తూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. రోడ్ల పక్కనే నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్నారు. మాంసంపై ఈగలు వాలి, దుమ్ము పడుతోంది. అధికారులు స్లాటర్ హౌస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– మురళీ, కౌటాల

చర్యలు తీసుకుంటాం

కౌటాలలో స్లాటర్ హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. కౌటాలలో సుమారు ఏడు మటన్ షాపులు ఉన్నాయి. దుకాణదారులు అన్ని అనుమతులు తీసుకుని మాంసం విక్రయించాలి. దుకాణాలు తనిఖీ చేసి అనుమతి లేనివారిపై చర్యలు తీసుకుంటాం.

– సాయికృష్ణ, కార్యదర్శి, కౌటాల

వారసంత.. సమస్యల చింత

- మరుగుదొడ్లు లేక తప్పని ఇబ్బందులు
- రోడ్డుపైనే నిలుస్తున్న మురికి నీరు
- షెడ్లు లేక తిప్పలు పడుతున్న వ్యాపారులు


కెరమెరిలో కొనసాగుతున్న వారసంత

కెరమెరి: వారసంత సమస్యలతో సతమతమవుతోంది. కొన్నేళ్ల నుంచి సంత కొనసాగుతున్నా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా కూరగాయల విక్రయదారులతో పాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 157 గ్రామాలు ఉన్నాయి. ప్రతీ ఆదివారం కెరమెరిలో జరిగే వారసంతకు అనేక గ్రామాల నుంచి ప్రజలు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు.

సౌకర్యాలు కరువు..

మండల కేంద్రంలో వారసంత సుమారు 20 ఏళ్ల నుంచి కొనసాగుతుంది. అప్పటి నుంచి నేటి వరకు కూడా ఎలాంటి సౌకర్యాలు లేవు. గ్రామ పంచాయతీ నిధులు కాని, ప్రత్యేక నిధులతో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా కూరగాయల వ్యాపారుల కోసం షెడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ కొందరు గొడుగులు చేతపట్టుకొని విక్రయాలు జరుపుతున్నారు. కొన్ని సందర్భాల్లో తుపాను, భీకర వర్షం కురిసినప్పుడు పైకప్పులు ఎగిరిపోయి కూరగాయలు వర్షంలో తడిసిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మెయిన్ రోడ్డు నుంచి వెళ్లే దారిలో మురికి నీరు నిలిచి ఉంటుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నిధుల జాడేది..?

గ్రామ పంచాయతీకి జనాభా ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తున్నాయి. రూ.లక్షతో ప్రారంభమైన నిధులు ప్రస్తుతం సుమారు రూ. 5 లక్షల వరకు చేరాయి. ఆ నిధులను గ్రామ పంచాయతీ అభివృద్ధితో పాటు విద్యుత్ బల్బుల ఏర్పాటు, కరెంటు చార్జీలు చెల్లించడం, ఇతర చెల్లింపులు, పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపులు వంటివి చేయడంతో పాటు వారసంత అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. కాగా వారసంత వేలం ద్వారా ఈ ఏడాది రూ. 1.87 లక్షలు వరకు సమకూరనున్నాయి. గతేడాది కూడా రూ.లక్షకు పైగానే ఆదాయం వచ్చింది. ఏళ్లు గడుస్తున్నా వారసంతను అభివృద్ధి చేయడం లేదని వ్యాపారులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారసంతలో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం..



కెరమెరిలో వారసంతలో త్వరలో సౌకర్యాలు కల్పిస్తాం. ఇప్పటికే మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 3లక్షలు నిధులు మంజూరయ్యాయి. రోడ్డుపై నీరు రాకుండా చూస్తాం. మంచినీటి సౌకర్యం కల్పిస్తాం. కులగణన పనులు పూర్తి కాగానే వారసంత అభివృద్ధిపై దృష్టి పెడుతాం.

– అంజద్ పాషా, ఎంపీడీవో

క్లుప్తంగా

'సమస్యల పరిష్కారానికి ఏకమవుదాం'


మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యల పరిష్కారానికి ఆదివాసీలమంతా ఏకమవుదామని రాయిసెంటర్ అధ్యక్షుడు కొర్కెట జ్ఞానేశ్వర్ అన్నా రు. జిల్లా కేంద్రంలోని రాయిసెంటర్‌లో గురువారం ఆదివాసీ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని రాయిసెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీల సమస్యలు, అభివృద్ధిపై చర్చించి, ఉన్నతాధికారులకు విన్నవించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అన్ని సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఆదివాసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాయిసెంటర్ జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, నాయకులు అర్జున్, రఘు, చందన్, బాదీరావ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమి కేటాయించాలి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిని కేటాయిచాలని కోరుతూ గురువారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు సిఫారసు చేసిన లేఖను సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం తమ సమస్యలను ఆయనకు వివరించారు. జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోలెం వెంకటేశ్, ఉపాధ్యక్షుడు అంగల తిరుపతి, నాయకులు మహేందర్, పెర్క మహేశ్, గోవిందుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి


రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

కౌటాల: కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరుతూ కౌటాల జూనియర్ కళాశాల అధ్యాపకులు రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను మండల కేంద్రంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా చాలిచాలనీ జీతాలతో ఉద్యోగం చేస్తున్నామని తెలిపారు. గతంలో కొందరు అధ్యాపకులను క్రమబద్ధీకరించిందని, అదే మాదిరిగా ఒకేషనల్ అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. అధ్యాపకులు రాంబాబు, మోతిలాల్, రజిత, రాందాస్, రవీందర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఎస్జీటీ మండల కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఎస్జీటీ మండల కార్యక్రవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు. మండల అధ్యక్షుడు గోవిందరావు, ఉపాధ్యక్షుడు రాజేందర్, కోశాధికారి రామ్, మహిళా అధ్యక్షురాలుగా చంద్రకళ, సూర్యమణి, కార్యదర్శులుగా ప్రవీణ్, చొక్కారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అరుణ్, దినేష్, తిరుపతి, వినోద్, రాజ్‌కుమార్, హరి ప్రకాశ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్ తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం

దహెగాం: టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, ఉపాధ్యక్షుడిగా యాకూబ్, ఉపాధ్యక్షురాలిగా మధులత, కోశాధికారిగా వంశీ, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు జిల్లా కార్యదర్శి తులసీరామ్ అభినందనలు తెలిపారు.

పంట మార్పిడి చేయాలి


కౌటాల: మాట్లాడుతున్న ఏఈవో చౌదరి అంజన్న

కౌటాల: రైతులు తప్పనిసరిగా పంటలు మార్పిడి చేయాలని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గుడ్లబోరి రైతు వేదికలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలం నుంచి మట్టి నమూనాలు సేకరించాలన్నారు. భూసారం పెరగడానికి రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. యాసంగి పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలన్నారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులకు ఏవో మనీషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు మంచి దిగుబడి వస్తాయన్నారు. ఏఈవో శ్రీవిద్య, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బాలికలకు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక, బాల కార్మికుల చట్టాల గురించి వివరించారు. గిరి గ్రామాల్లో ఇంటికి వెళ్లిన తర్వాత చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఎం జంగు, న్యాయవాదులు నరహరి, అంజలిదేవి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

లింగాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం అన్ని పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఉపాధ్యాయుడు భోజనాన్ని రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని అన్నారు. సమావేశంలో సీఆర్పీ జాదవ్ సంజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


కొండపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పెంచికల్‌పేట్: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని కొండపల్లి, కొత్తగూడ గ్రామాల్లో గురువారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పల్లెల్లో నాటుసారా తయారీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు తమవెంట వాహనధ్రువపత్రాలు తెచ్చుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థినులు యవ్వనదశలో వచ్చే అంతర్గత సమస్యలు న్యూనత భావం లేకుండా తెలియజేయాలని గైనకాలజిస్టులు సునీత రావోజీ, నవ్యశ్రీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ దశలో శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి కళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్యశిబిరం

లింగాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే డా.సునందా, సూపర్‌వైజర్ దత్తారాం ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించి, ఐరన్ మాత్రలు అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఫార్మసిస్ట్ కవిత, ఏఎన్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా చూడాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా భీమన్న స్టేడియంలో నిర్వహించే కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం భీమన్న స్టేడియాన్ని సందర్శించి క్రికెట్ పిచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ లెవల్ పోటీల కోసం స్టేడియాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేయాలన్నారు. పిచ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పోటీల కోసం సింగరేణిలోని ఆరు రీజియన్ల పరిధిలోని క్రీడాకారులు హాజరుకానున్న నేపథ్యంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. రాత్రివేళ సాధన చేసుకునేందుకు వీలుగా స్టేడియంలో లైటింగ్ సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

బెల్లయ్య నాయక్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్సీ


స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో ప్రజాపాలన విజయోత్సవాల కోసం గురువారం వచ్చిన రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సత్కరించారు. కాంగ్రెస్ రాష్ట్ర టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న ఉద్యమ నాయకులు

బెజ్జూర్: తెలంగాణ ఉద్యమ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ సర్పంచ్ ఉమ్మెర లింగయ్య యాదవ్‌తోపాటు సులుగుపల్లి గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు సోయం చిన్నయ్య గురువారం కాగజ్‌నగర్‌లోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి వారికి కండువాలు కప్పారు.

రేషన్‌బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం, వాహనం

సిర్పూర్(టి): కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా సమీపంలోని మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సిర్పూర్(టి) వైపు నుంచి హుడ్కిలీ మీదుగా మహారాష్ట్రకు వాహనాన్ని బియ్యం తరలిస్తుండగా హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బొలెరో వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి


అధికారులతో చర్చిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణి సంస్థ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాట్లపై గురువారం అన్నివిభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 23న నిర్వహించే వేడుకల కోసం భీమన్న స్టేడియాన్ని సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, సర్వే అధికారి చంద్రశేఖర్, ఎస్ఈ సివిల్ మదీనాబాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షుడిగా గుండా శ్యాం

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుండా శ్యాం ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఆన్‌లైన్ ఓటు విధానంలో రెండు వేల పైచిలుకు ఓట్లతో రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా విజయం సాధించారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు నూతనంగా ఎన్నికైన గుండా శ్యాంను సత్కరించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ తిరుపతి ఫోన్ ద్వారా అభినందించారు.

చేతిపంపునకు మరమ్మతు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెడిపోయిన చేతి పంపునకు గురువారం మరమ్మతు చేశారు. పాఠశాల పర్యవేక్షణకు వచ్చిన ఎంపీడీవో అల్బర్ట్‌ను విద్యార్థులు చేతిపంపు మరమ్మతు చేయించాలని కోరారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది చేతి పంపునకు మరమ్మతు చేశారు. హెచ్ఎం యాదగిరి, విద్యార్థులు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు చలికాలం ప్రారంభం కావడంతో దుప్పట్లు, స్వెటర్లు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు భీంరావ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చలి కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల–2లో ఖాళీగా ఉన్న రెండు హెడ్‌కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ షగుప్త ఓ ప్రకటనలో తెలిపారు. వంట చేయడంలో నైపుణ్యం ఉన్న ముస్లిం మైనార్టీ పురుషుడు/మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

108లో ప్రసవం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామానికి చెందిన గర్భిణి వందనకు గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబీకులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను ఆసిఫాబాద్ ఆస్పత్రి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108లో ప్రసవం చేయగా ఆడ పిల్లకు జన్మినిచ్చిందని ఈఎంటీ ప్రవీణ్‌యాదవ్ తెలిపారు. పైలెట్ నాగార్జున, సిబ్బంది ఉన్నారు.